క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొత్తపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎస్‌టీయూ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్‌కు వినతి పత్రం అందించారు. ఎస్‌ఆర్‌లో సెలవులు నమోదు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు త్వరతగతిన మంజూరు చేయాలని, 3 నెలలకు ఒకసారి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు పెనుమల్లు ఆనంద రెడ్డి , కార్యదర్శి లలిత కుమారి, శేఖర్, మూర్తి, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో హుండీలను గురువారం లెక్కించనున్నట్లు ఈఓ భళ్ల నీలకంఠం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్తిక మాసం ప్రారంభం కావడంతో ప్రత్యేకంగా హుండీల ద్వారా వచ్చే ఆదాయం తెలుసుకోవడానికి ముందుగా హుండీలను లెక్కిస్తున్నట్లు తెలిపారు. దీనిలో దేవదాయ శాఖ అధికారులు, భక్త సంఘం నాయకులు పాల్గొంటారని తెలిపారు.

నష్ట పరిహారం అందని రైతుల వివరాల పరిశీలన



వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు లక్ష్మీపురం రైతులకు పంట నష్ట పరిహారం అందలేదని ఫిర్యాదులు రావడంతో చేబ్రోలు రైతు సేవ కార్యాలయంలో బుధవారం వ్యవసాయశాఖాధికారులు లిస్టులు పరిశీలన చేపట్టారు. ఇన్చార్జి ఏడీ జోగిరాజు ఆధ్వర్యంలో లిస్టులను పరిశీలించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ లిస్టులను పరిశీలించిన అధికారులు ఎవరికి నష్ట పరిహారం పడలేదు, ఎందుకు పడలేదనే విషయాలను తెలుసుకుని జరిగిన లోపాలను గుర్తించారు. దీనిపై తదుపరి చర్యలు తీసుకునేందకు ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సత్యనారాయణ వీఏలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సామర్లకోట: పి.వేమవరం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై కాకినాడ వెళ్తున్న సమయంలో కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని వెంటనే కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరు గొంచాల- అచ్చంపేట మధ్యలో ఉన్న 216 జాతీయ రహదారి దాటుతున్న సమయంలో ఈ కారు ఢీకొంది.

రేపు మినీ జాబ్ మేళా

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ బాలరాజు తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన 19 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 86889 77277, 82477 88247 నంబర్లను సంప్రదించాలన్నారు.

సినిమాలు



పెద్దాపురం	
లలితా స్క్రీన్-1	దేవర
లలితా స్క్రీన్-2	సత్యం సుందరం
వీరభద్ర	దక్షిణ
శోభా	శ్వాగ్
సామర్లకోట	
అనుశ్రీ స్క్రీన్-1	దేవర
అనుశ్రీ స్క్రీన్-2	దేవర
విఘ్నేశ్వర	సత్యం సుందరం
పిఠాపురం	
అన్నపూర్ణ	శ్వాగ్
శ్రీపూర్ణ	దేవర
శ్రీసత్య	సత్యం సుందరం
శ్రీవెంకటేశ్వర	మిస్టర్ సెలబ్రిటీ
ఉప్పాడ	
శ్రీనివాస	మత్తు వదలరా 2

స్వామియే శరణం అయ్యప్ప

- అయ్యప్ప దీక్షతో ఆరోగ్య రక్ష
- నియమ, నిష్టలతో మాలధారణ



గుడివాడలో పడిపూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు



అయ్యప్ప పడిపూజ చేస్తున్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దొరబాబు (ఫైల్)

పెద్దాపురం: మాలధారణం నియమాల తోరణం.. జన్మ తారణం దుష్కర్మ వారణం.. స్వామి శరణం, అయ్యప్ప శరణం అంటూ భక్తి ప్రపత్తులతో ఆ స్వామి దీక్ష తీసుకునే భక్తులతో నియోజకవర్గం ఆధ్యాత్మికంగా వెలుగొందుతోంది. ఏటా ఈ దీక్ష ధరించే భక్తులు పెరుగుతుండడంతో విశేషం. స్వామి దీక్ష ఆధ్యాత్మిక చింతనతో పాటు, మంచి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. ఏటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో భక్తులు మాలధారణ చేస్తుంటారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు స్వామి మండల దీక్షను చేపట్టారు. అయ్యప్ప దీక్షాదారులతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నియోజకవర్గంలో గుడివాడ, వీకే రాయపురం, కాండ్రకోట, చదలాడ, ఉండూరు, అచ్చంపేట, నవర, చంద్రంపాలెం, చంద్రమాంపల్లి, తిరుపతి, గోరింట గ్రామాల్లో వందలాది మంది అయ్యప్ప భక్తులు అయ్యప్ప మాలధారణ చేశారు.

క్రమశిక్షణకు బాటలు

41 రోజుల పాటు నియమ, నిష్ఠలతో ఆచరించే స్వామి దీక్ష శారీరక ఆరోగ్యాన్నే కాకుండా మానసిక ప్రశాంతతను చేకూరుస్తుంది. ప్రతి వ్యక్తిలో సత్ప్రవర్తన, క్రమశిక్షణను అలవర్చుతుంది. శాఖాహారం తీసుకోవడం, తారతమ్యం లేకుండా అందరినీ సమానంగా చూడడం వంటి నియమాలను తెలియజేస్తుంది. అయ్యప్ప మాల ధరించిన స్వాములు 41 రోజుల పాటు కఠోర దీక్షను పూర్తి చేసుకుని ఇరుముడులు కట్టి అయ్యప్ప స్వామి కొలువైన శబరిమలైకు వెళ్తుంటారు. కొంతమంది స్వాములు అంతదూరం వెళ్లలేక మండపేట మండలం ద్వారపూడి, శంఖవరం మండలంలోని ఆంధ్రా శబరిమలైలో అయ్యప్ప ఆలయాలను దర్శించుకుంటున్నారు. ఈ దీక్షా సమయంలో చేసిన పూజల్లో ఆరోగ్యకరమైన రహస్యాలు నిండి ఉన్నాయని గురుస్వాములు చెబుతున్నారు.

ప్రయోజనాలు ఎన్నో..

- ఉదయం, సాయంత్రం చల్లటి నీటి స్నానం చేయడం వల్ల శరీరంలో శక్తి, ఏకాగ్రత, ఉత్తేజం పెరుగుతాయి. శిరస్నానంతో రక్తపోటు తగ్గి జీర్ణశక్తి అభివృద్ధి చెందుతుంది.
- నుదిటిపై చందనం, కుంకుమ, విబూది ధరించడం వల్ల చల్లదనంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుంది. కాళ్లకు చెప్పులు లేకుండా నడవడంతో చిన్న చిన్న రాళ్లు పాదాలకు తగిలి నరాలకు స్పందన వస్తుంది.
- శీతాకాలం స్వాములు నల్లటి వస్త్రాలను ధరిస్తారు. నల్లటి వస్త్రాలు వెచ్చదనాన్ని ఇస్తాయి. చలి కాలంలో నల్లటి వస్త్రాలు శరీరానికి ఉపకరిస్తాయి. అలాగే భక్తులు శని ప్రభావానికి లోను కాకుండా ఉండేందుకు కూడా నల్లటి వస్త్రాలు ధరిస్తారు.

పెరిగిన భక్తిభావం



అయ్యప్ప స్వామి మాల ధరిస్తే భక్తిభావం మరింత పెరుగుతోంది. చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చు. మనస్సు ఉత్తేజంగా ఉంటుంది. నేను ఇప్పటి వరకు 22 సార్లు మాల ధరించి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నాను. ఈ ఏడాది స్వాముల సంఖ్య మరింత పెరిగింది.

– కనపర్తి సీమదొర, గురుస్వామి, గుడివాడ, పెద్దాపురం మండలం

చెడుకు దూరం



దారి తప్పుతున్న జీవితాన్ని తీర్చిదిద్దేందుకు అయ్యప్ప దీక్ష ఎంతో దోహదపడుతుంది. చెడు అలవాట్లకు దూరం చేస్తుంది. ఆధ్యాత్మిక చింతన, దృఢసంకల్పం, విశ్వాసంతో దీక్ష చేపడితే మంచి చేకూరుతుంది. నేను ఎనిమిదో సారి దీక్ష చేపట్టాను.

– రేలంగి బుజ్జి, చంద్రమాంపల్లి, పెద్దాపురం మండలం

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి



చిన్నారావు

కొత్తపల్లి: దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ చిన్నారావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో దుకాణాల ఏర్పాటుకు సంబంధించి బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, పోలీసు, పొల్యుషన్ శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మందుగుండు సామగ్రిని అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత నిర్వాహకులే వహించాలన్నారు. ఇప్పటి వరకూ 9 దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతుల కోసం దరఖాస్తులు అందాయన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి, పోలీసులతో దుకాణాల ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. మూలపేట-2, ఉప్పాడ-2, వాకతిప్ప-2, కొండెవరం, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి గ్రామాల నుంచి ఒక్కొక్క దరఖాస్తు అందాయని వివరించారు. అనుమతులు పొందిన వారు నిబంధనలు పాటించాలని సూచించారు.

బాలల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖాధికారి సుజాత

పెద్దాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పెద్దాపురం ఎంపీడీఓ శ్రీలలిత, ఉద్యాన శాఖాధికారి సుజాత అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ ఉష అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ బాలలు, బాలింతల ఆరోగ్య పరిక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద స్వచ్ఛమైన తోటకూర, కరివేపాకు, పాలకూర, మెంతికూర, నిమ్మ, దానిమ్మ వంటి వాటిని పెంచుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దీనికి ప్రభుత్వం ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.పది వేల చొప్పున నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సీడీపీఓ ఉష మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో సుమారు 47 కేంద్రాల్లో ఆకుకూరల సాగుకు చర్యలు చేపట్టామన్నారు. పోషకాహార విలువలందించే ఆకుకూరలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆయా ప్రదేశాల్లో నిర్వహించే సాగు పద్ధతిపై ఉద్యాన శాఖాధికారి సుజాత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రకళ, రమణమ్మ, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెప్మా బజార్



సామర్లకోటలో మెప్మాబజార్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: స్థానిక సంత మార్కెట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మెప్మా బజార్ ఆకట్టుకుంది. మెప్మా సిబ్బంది ప్రజలకు ఉపయోగపడే వస్తువులను తయారు చేసి ప్రదర్శించడంతో పాటు అమ్మకాలు చేశారు. ఈ మెప్మా బజారును మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ప్రారంభించారు. బయట మార్కెట్‌లో లభించే కంటే తక్కువ ధరలకు మెప్మా బజార్‌లో సరకులు లభించడంతో వినియోగదారులు అధిక సంఖ్యలో తరలివచ్చి సరకులు కొనుగోలు చేశారు. అర్బన్ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు చెందిన ప్రతినిధులు తినుబండారు, వస్త్రాలు, అల్లికల వస్తువులు, డ్రైఫ్రూట్స్, ఆట వస్తువులు వంటివి తయారు చేసి అమ్మకానికి సిద్ధం చేశారు. కార్యక్రమంలో మెప్మా ఇన్‌చార్జి సిటీ మేనేజర్ పి.ప్రసాద్‌బాబు, సీఓ బి.వెంకటలక్ష్మి, డీఓ ఎం.రామోజీరావు, ఆర్పీలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



వల్లూరులో రీ సర్వే గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: రైతులు రీ సర్వే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల పరిధి వల్లూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఈ రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతుల దస్తావేజు, వారి స్వాధీనంలో ఉన్న భూమి మరొకరికి రికార్డు అయితే రీ సర్వేలో మార్పు చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. భూములకు సంబంధించిన యధార్థ పరిస్థితులపై ప్రతి రైతు వివరించి సహకరించాలన్నారు. అవసరమైన సమయంలో నోటీసులు ఇచ్చి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. గ్రామ సభలో సాయంత్రం వరకూ 28 అర్జీలు వచ్చాయని చెప్పారు. సబ్ డివిజన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని నాలుగు, పట్టాదారు పాస్ పుస్తకంలో పేరు మార్పు కోసం ఒకటి, రీ సర్వే తరువాత విస్తీర్ణం తగ్గిందని 10, తన జిరాయితీ భూమి లేఅవుట్‌గా నమోదైందని మూడు, సర్వే నంబరు తప్పుగా పడిందని 4, తన భూమి అనుభవ స్వభావం తప్పుగా నమోదైందని ఒకటి, తన భూమికి ఆధార్, పోస్ నంబరు లింక్ తప్పు పడిందని ఒకటి, ఇతర దరఖాస్తులు ఐదు వచ్చాయని తహసీల్దార్ వివరించారు. బుధవారం వల్లూరులో గ్రామసభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు సీహెచ్ నరసింహమూర్తి, బి.జనార్దన్, ఎస్.దయాకిరణ్, డి.మోషే, వీఆర్వోలు కె చంద్రబాబు, ఎం.దుర్గాప్రసాద్, ఎండీ ఖాదర్‌వల్లీ, ఆర్.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో సత్తా చాటాలి



పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో కోచ్, అధ్యాపకులు

సామర్లకోట: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు సత్తా చాటాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ అన్నారు. 25 నుంచి 27 వరకూ కాణిపాకంలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేయడానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో 18 మంది క్రీడాకారులతో ఉమ్మడి జిల్లా జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జాన్‌మోజెస్ క్రీడాకారులకు కిట్లు సమకూర్చి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖోఖోలో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి కె.పట్టాభిరామం, పీడీ మట్టా సుబ్బారావులు క్రీడాకారులను ఎంపిక చేశారు. బి.గౌరీశంకర్ (కెప్టెన్, కిర్లంపూడి), పి.సతీష్‌వర్మ(అమలాపురం), ఆర్.వినయ్, ఆర్.రవిచంద్ర (దివిలి), జి.విజయ రవి కిరణ్, టీహెచ్‌వీడీ హనుమంతు, సీహెచ్ మణికంఠ (విరవ), ఎ.శ్యాంశివ, ఎస్‌ఎస్‌డీ ప్రసాద్ (తుని), జె.ఈశ్వర్‌రెడ్డి (సామర్లకోట), ఎ.సుభాష్, ఎస్.దుర్గాప్రసాద్, కె.చినసత్యం, పి.సుబ్రహ్మణ్యం (కాకినాడ), కె.విజయ్ (భైరవపాలెం)లు ఎంపిక అయ్యారు. కోచ్ కేఎల్ పాపారావు, మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్, సీనియర్ క్రీడాకారుడు కర్రి శ్రీనివాసరావు, ఉబా కెనడీ, రాజన్న, దొర, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లీలా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మూలపేటలో రీ సర్వే గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలో బుధవారం తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. రీ సర్వేలో అభ్యంతరాలపై రైతులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి డీఎస్పీ భరోసా



సామర్లకోటలో కానిస్టేబుల్ భార్యను పరామర్శిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కానిస్టేబుల్ కుటుంబాన్ని పెద్దాపురం డీఎస్పీ పి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో పరామర్శించి ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. 1992లో సామర్లకోటకు చెందిన కానిస్టేబుల్ ముసిరి జగదీశ్వరరావు కాకినాడలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక రౌడీ దాడిలో కత్తి పోట్లకు గురై సుమారు 20 రోజులు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మృతి చెందిన పోలీసు కుటుంబాలను పరామర్శించి వారికి భరోసా ఇస్తున్నారు. ఇందులో భాగంగా కానిస్టేబుల్ భార్య బుచ్చిరాజుకు పండ్లు, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1996 వరకూ తనకు పెన్షన్ వచ్చిందని, తరువాత నుంచి పెన్షన్ నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సహాయం కూడా అందలేదని, దీని కోసం తరచూ పోలీసు ఉన్నతాధికారుల కార్యాలయాలకు తిరుగుతున్నా ఫలితం లేదని వాపోయింది. కొన్ని సర్టిఫికెట్లు కావాలని చెబుతున్నారని డీఎస్పీకి ఆమె వివరించింది. ఆ సర్టిఫికెట్లు వచ్చే విధంగా తాము కృషి చేస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ ఎ.కృష్ణభగవాన్, ఎస్సై మూర్తి, అడపా గరగారావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నో ఫాగింగ్..



కట్టమూరు పంచాయతీలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- మూలకు చేరిన మెషీన్లు
- దోమల నియంత్రణకు చర్యలు శూన్యం
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దుస్థితి

పెద్దాపురం: పారిశుధ్యం పడకేసింది.. సమస్య నానాటికీ పెరిగిపోతోంది.. దీనివల్ల పెరిగిన దోమలు జనం రక్తం పీల్చేస్తున్నాయి.. జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.. అయినా దోమల నియంత్రణ చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. పెద్దాపురం పట్టణంతో పాటు రూరల్ గ్రామాల్లో ఈ పరిస్థితి చేయిదాటింది. పట్టణ విస్తీర్ణం రెండు కిలోమీటర్లు కాగా, సుమారు 50 వేల మంది వరకూ జనాభా నివసిస్తున్నారు. మొత్తం 93 మందితో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. రోజుకు 25 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. పట్టణంలో దోమల నియంత్రణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రం ఒక్కటే ఉంది. అయినా దానిని వినియోగించిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. దీనివల్ల దోమలు పెరిగిపోయి జనం ఇబ్బంది పడుతున్నారు.

గతమెంతో ఘనం

గత ప్రభుత్వంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సాయంత్రం వేళ ఫాగింగ్ మెషీన్ ద్వారా దోమల నివారణకు చర్యలు చేపట్టేవారు. తద్వారా వ్యాధులు ప్రబలకుండా చూసేవారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణను గాలికి వదిలేసింది. దీనివల్ల ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య బాగా పెరిగింది. పరిసరాల పరిశుభ్రత లేకపోవడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవడంతో ఇబ్బంది వస్తోంది. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు, నేతల సందర్శన సమయాల్లో మినహా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల శుభ్రతకు చర్యలు పూర్తి స్థాయిలో లేవు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మున్సిపల్, గ్రామ పంచాయతీలకు ఫాగింగ్ మెషీన్లు అందజేశారు. వీటి నిర్వహణకు గ్రామాల్లో అయితే పంచాయతీ జనరల్ నిధులు, పట్టణంలో శానిటరీ విభాగ నిధులు వినియోగించాలి. వీటి నిర్వహణకు రోజుకు సుమారు రూ.700 నుంచి రూ.800 వరకు ఖర్చు అవుతుంది. నిధుల లేమి పేరుతో ఫాగింగ్ యంత్రాలను పక్కన పెట్టేయడంతో దోమలు పెరిగి వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఫాగింగ్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉండలేకపోతున్నాం..



పట్టణంలో పారిశుధ్య సమస్య కారణంగా దోమల ఉధృతి ఎక్కువైంది. ఎక్కడా ఉన్నా దోమలతో ఉండలేకపోతున్నాం. దోమ కాటుతో రోగాల బారిన పడుతున్నాం. ప్రస్తుత ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి పరిశుభ్రత పరిరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–తాడి కస్తూరి, నాగంపేట

అందుబాటులోకి తీసుకువస్తాం



ఫాగింగ్ మెషీన్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రస్తుతానికి దోమల నివారణకు డ్రెయిన్లలో స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. మెషీన్లు అందుబాటులో ఉన్నా మరమ్మతుల కారణంగా ఇబ్బంది ఉంది. ఒకటో తేదీ నుంచి పట్టణంలో అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయిస్తాం.

– కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

విద్యార్థులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు



వన్నెపూడిలో విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: హిమోగ్లోబిన్ టెస్టుల ద్వారా విద్యార్థులు అనీమియా నివారణకు చర్యలు చేపట్టినట్లు గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.సుబ్బారావు తెలిపారు. గొల్లప్రోలు మండలం వన్నెపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి హిమోగ్లోబిన్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలల్లో హిమోగ్లోబిన్ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. బాలల్లో అనీమియా (రక్తహీనతను) సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తామన్నారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.లోవ రాజేంద్రప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు వి.నూకరత్న కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు అహ్మద్ బాషా, షేక్ రజుమ్, బి.రత్న కుమారి, శృతి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



ఈఓల సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయ శాఖ డీసీ రమేష్‌బాబు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కార్తికమాసం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. కాకినాడ దేవదాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఆలయాల ఈఓలు, అధికారులతో కార్తిక మాస ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నవంబర్ రెండు నుంచి డిసెంబర్ రెండు వరకూ కార్తికమాసం పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఈఓలకు సూచించారు. పంచారామ క్షేత్రాల్లో సోమవారం అభిషేకానికి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని అన్నారు. ఈ నెల 31 లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. కార్తిక సోమవారాలు, పౌర్ణమి, శుద్ధ బహుళ ఏకాదశి, ప్రభుత్వ సెలవు రోజుల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయాల వద్ద మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, స్నానఘట్టాల్లో అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కార్తిక మాసం రద్దీ రోజుల్లో కార్యాలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని అన్నారు. తెల్లవారుజాము 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి ప్రాతఃకాల పూజల అనంతరం 4.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దర్శనాలు, తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. కార్తిక మాసమంతా స్వామివారి గర్భాలయ అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్తిక దీపారాధన చేసుకునేందుకు వీలుగా మండపం వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు.